క్లుప్తంగా

జాగ్రత్తలు తప్పనిసరి

చిన్నంబావి: రాబోయే మూడు రోజులు అతి భారీ వర్షాలు కురుస్తాయని దీనిపై ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని ఇంచార్జి తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎస్ఐ జగన్మోహన్, ఎంపీడీఓ రామస్వామి, సమీక్ష సమావేశాన్ని నిర్వాహించారు. ఈ సందర్భంగా జిల్లాను రెడ్‌జోన్‌గా వాతావరణ శాఖ ప్రకటించడంతో అన్నిశాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆయా గ్రామాల్లో ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించాలని సూచించారు. అదేవిధంగా కృష్ణానది పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎవరు చేపలవేటకు వెళ్లొదన్నారు.

నదితీర వాసులు అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూర్ : మండలంలోని నదీతీర ప్రాంతాలకు చెందిన గ్రామాల వారు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ చాంద్‌పాషా, ఎస్సై నరేందర్, ఎంపీడీఓ శ్రీపాద్, కమిషనర్ శశిధర్ విన్నవించుకున్నారు. మండలంలోని మూలమల్ల, రేచింతల, ఆరేపల్లి, కత్తేపల్లి, తూంపల్లి తదితర గ్రామాలను సందర్శించి కృష్ణానది నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. అలాగే మూలమల్లవద్ద చెరువు అలుగు పారదంతో రాకపోకలను నిలిపేశారు. రామన్‌పాడువద్ద, రేచింతలవద్ద కృష్ణానది ఉప్పొంగుతుండడంతో రాకపోకలను నిలిపేస్తూ గ్రామస్తులను, ప్రయాణికులకు అప్రమత్తం చేశారు.

బూట్ల పంపిణీ

వనపర్తి రూరల్: మండలంలోని కీర్యాతండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బూట్లు అందజేశారు. ఈ సందర్భంగా దాత ముఖీద్ తండాలోని చదువుతున్న విద్యార్థులకు షూస్ ,సాక్స్ వితర్ణ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ మద్దిలేటి పాల్గొని బూట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రాంరెడ్డి పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో దొంగలు

కొత్తకోట రూరల్: పెద్దమందడి గ్రామశివారులోని చౌదరిపల్లి ప్రసన్నాంజనేయస్వామి ఆలయములో ఈనెల 7న కొందరు వెండి వస్తువులు, హుండీని చోరీ చేసి తీసుకెళ్లిన కేసును పోలీసులు ఛేదించారు. ఎస్ఐ శివకుమార్ కొత్తకోట సీఐ రాంబాబు ఆదేశానుసారం 5 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఆలయంలో చోరికి పాల్పడిన దొంగల కోసం గాలింపు చేపట్టారు. బుధవారం ఉదయం మండలంలో అనుమానంగా తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకుని స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించగా తామే దొంగతనం చేసినట్టు ఒప్పుకున్నారు. చోరీలో గోపాల్‌పేట మండలం తాడిపర్తి గ్రామానికి చెందిన ముగ్గురు మహ్మద్‌షఫి, షేక్ రసూల్, మహ్మద్ అన్వర్‌లు ఉన్నారు. నగలు అమ్మగా వచ్చిన రూ.5వేలతో పాటు హుండీలో ఉన్న రూ.25వేలను సమానంగా పంచుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. అంతేకాకుండా నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలంలోని మంగనూర్ గ్రామంలో చౌడేశ్వరి ఆలయంలో బంగారు, వెండి వస్తువులను చోరీ చేసిన ఆభరణాలను విక్రయించగా రూ.10 వేలు వచ్చినట్టు నిందితులు ఒప్పుకున్నారు. వీరి నుంచి రూ.10వేల నగదును, రెండు సెల్ ఫోన్లు, దొంగతనం చేసేందుకు ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరుపర్చగా జడ్జి 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

వాహనాలు ఢీ..

వనపర్తి రూరల్: రెండు వాహనాలు ఢీ కొని ట్రాఫిక్ జామ్ అయిన ఘటన పెబ్బేరులో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం కొత్తకోట బైపాస్ దగ్గర బుధవారం వర్షం కారణంగా కర్నూల్‌వైపు వెళ్తున్న వాహనాలు అదుపుతప్పి నాలుగు వాహనాలు ఒకదానికొకటి ఢీకొని రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. దీంతో వాహనాలు భారీగా నిలిచిపోవడంతో పోలీసులు అక్కడికి చేరుకొని పెబ్బేరు పట్టణం నుంచి దారి మళ్లించారు. అనంతరం క్రేన్ సాయంతో వాహనాలను తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఘటనపై ఎస్ఐ యుగేందర్‌రెడ్డిని అడుగగా ప్రాణనష్టం జరగలేదన్నారు.

అన్నదాతల అగచాట్లు



అమరచింత: జిల్లాలో యూరియా కొరత లేదని ఓ పక్క అధికారులు ప్రకటనలు చేస్తుండగా.. మరోపక్క సకాలంలో సరఫరా చేయడం లేదంటూ క్షేత్రస్థాయిలో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు రెండు బస్తాలు ఇవ్వాలని అధికారులు ఆదేశాలిచ్చినా.. దుకాణదారులు ఒక రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేస్తున్నారని, ఇదేమిటని ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానాలిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. అలాగే యూరియా బస్తా ధర రూ.265 ఉండగా.. రూ.300 వసూలు చేస్తున్నారని.. ఈ విషయం సంబంధిత శాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. యూరియా కోసం ఉదయం ఆరు నుంచే దుకాణాల వద్ద పడిగాపులు పడాల్సిన దుస్థితి నెలకొందని.. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

వర్షం పడిందా.. రాకపోకలు బంద్



కేశంపేట గ్రామంవద్ద కల్వర్టుపై ప్రవహిస్తున్న నీరు

- ప్రజలకు తప్పని ఇబ్బందులు
- ఇంకెన్నాళ్లు భరించాలని గ్రామస్తుల ఆవేదన
- బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని వేడుకోలు

గోపాల్‌పేట: వర్షం పడిందంటే రేవల్లి, ఏదుల మండల ప్రజలకు అపసోపాలు తప్పడం లేదు. చెరువులు, వాగుల నుంచి వచ్చే వర్షం నీరు వెళ్లేందుకు సరైన వాగులు, పిల్లకాల్వలు లేకపోవడం దీనికి తోడు రహదారుల వద్ద బ్రిడ్జిలు లేకపోవడం వలనే ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు తెలుస్తోంది. గత కొన్నేండ్లుగా రేవల్లి మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం పడినప్పుడు బస్సులు, ద్విచక్ర, ఇతర వాహనాలు వెళ్లేందుకు అవస్థ పడుతున్నారు. ఆయా ప్రభుత్వాలు, ఇటు అధికారుల నిర్లక్ష్యం వలనే సమస్య ఎదురవుతోందని ప్రజలు అంటున్నారు. అధికారులు స్పందించి అవసరమైన చోట బ్రిడ్జిలు, రోడ్లు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇవీ మండలంలోని సమస్యలు

గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రేవల్లి నుంచి తల్పునూరు వెళ్లే దారిలో మైసమ్మవద్ద రహదారి తెగిపోయింది. దీంతో తల్పునూరు నుంచి రేవల్లికి రాకపోకలు నిలిచిపోయాయి. సమస్యను



తల్పునూరు నుంచి రేవల్లి వెళ్లే దారిలో బ్రిడ్జివద్ద కుంగిన రోడ్డు

వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో రోడ్డును వెంటనే పునరుద్ధరించారు. గతేదాది రేవల్లి, తల్పునూరు మధ్యలోనే డీ–8 మెయిన్‌కాల్వ సమీపంలో డీ–5 కాల్వ కట్ట కుంగిపోయింది. దీంతో రైతులు, ప్రజలు, వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. డీ–5 కాల్వ కట్టారు కానీ బ్రిడ్జి నిర్మించకపోవడం వల్ల వర్షం వచ్చిన ప్రతిసారి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేశంపేట గేటు నుంచి కేశంపేట వెళ్లేదారిలో కల్వర్టు ఉంది. 30 ఏళ్ల క్రితం కేవలం కాంక్రీట్ వేసి వదిలేశారు. చాకల్‌పల్లి, చింతలకుంట, మొద్దులకుంట నుంచి వచ్చేనీరు కేశంపేట గ్రామ సమీపం నుంచి బీర్లమోని చెరువు, రేమొద్దుల, మాచుపల్లి వరకు వెళ్తోంది. వర్షం వచ్చిన ప్రతిసారి వాగును దాటలేక తండాల గూండా 10 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోంది. కేశంపేట గేటువద్ద మూడు, నాలుగేళ్ల కిందట కల్వర్టు నిర్మించారు. వాహనాలు వెళ్లేందుకు అవకాశం ఉండేది కానీ బ్రిడ్జి నిర్మించకపోవడంతో భారీగా ప్రవహించి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

ఉద్యోగులకు తప్పని ఇబ్బందులు

వర్షం పడిన ప్రతిసారి రేవల్లిలో విధులు నిర్వహించే ఉద్యోగుల ఇబ్బందులు వర్ణనాతీతం అయ్యాయి. కేశంపేట సమీపంలో ఉన్న వాగు, కేశంపేట గేటువద్ద ఉన్నవాగు, నాగర్‌కర్నూల్ నుంచి రేవల్లి వచ్చే క్రమంలో ఎదురుపడే వాగులను దాటలేక ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వనపర్తి నుంచి రేవల్లికి వర్షం పడినప్పుడు వెళ్లాలంటే తండాలు, గుట్టలవెంట పోవాల్సివస్తోంది. వంతెనలు నిర్మాణం చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ప్రజల అవసరం కోసం బ్రిడ్జి నిర్మించాలి

వర్షం పడిందంటే తల్పునూరు నుంచి రేవల్లి వెళ్లాలంటే నరకంగా అనిపిస్తోంది. డీ–8 కాల్వ నుంచి డీ–5 కాల్వను ఏడేళ్ల క్రితం కాల్వ తీశారు. వర్షం పడిందంటే ద్విచక్ర వాహనాలు కట్టిలో కుంగిపోతున్నాయి.

–గోవర్ధన్, తల్పునూరు గ్రామస్తుడు, రేవల్లి మండలం

వచ్చే వేసవిలో తప్పకుండా పూర్తిచేస్తాం



డీ–8 మెయిన్ కెనాల్‌వద్ద బ్రిడ్జి నిర్మించాల్సి ఉంది. తల్పునూరు ప్రజలు రేవల్లి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది. ఇప్పుడు వర్షాలు ప్రారంభమైనందున చేపట్టలేదు. వచ్చే ఎండాకాలంలో బ్రిడ్జిని తప్పకుండా నిర్మిస్తాం.

– వెంకటయ్య, ఇరిగేషన్ ఏఈ, రేవల్లి

యూరియా సరఫరాలో ఇబ్బంది పెట్టొద్దు

పాన్‌గల్: జిల్లాలో రైతులకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన పడొద్దని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అన్నారు. బుధవారం మండలకేంద్రంతో పాటు అన్నారం ఆరోగ్య ఉపకేంద్రం, శాగాపూర్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. ముందుగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల గోదాంను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల విక్రయాలు, స్టాక్ రిజిస్టర్లను, బయోమెట్రిక్ ద్వారా అందుతున్న విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు అవసరమైన మేరకు యూరియా తీసుకెళ్లే విధంగా, నానో ఎరువులపై గ్రామాల్లో వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలన్నారు.

వ్యాధినిరోధక టీకాలు వేయించాలి

మండలంలోని అన్నారం ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు సకాలంలో వ్యాధినిరోధక టీకాలు వేయించుకునేలా చిన్నారుల తల్లులకు సమాచారం అందించి వారికి అవగాహన కల్పించాలన్నారు. నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ వివరాలను అందించాలని ఆయన సంబంధిత జిల్లా అధికారులకు సూచించారు.



బయోమెట్రిక్ స్లిప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

బట్టి చదువులకు స్వస్తి చెప్పాలి..

విద్యార్థులు బట్టి చదువులకు స్వస్తి పలికి సహజ ఆలోచన విధానాన్ని పెంపొందించుకోవాలన్నారు. మండలంలోని శాగాపూర్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. కంప్యూటర్ ల్యాబ్‌ను సందర్శించి శిక్షణపై ఆరా తీశారు. పదో తరగతి విద్యార్థులకు గణితం సబ్జెక్టుపై సమాధానాలను రాబట్టారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ శ్రీనివాసులు, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డా.సాయినాథ్‌రెడ్డి, డీఐఓ డా.పరిమళ, డీఏఓ ఆంజనేయులు గౌడ్, డీఈఓ అబ్దుల్ ఘనీ, ఏడీఏ తిప్పేస్వామి, తహసీల్దార్ సత్యానారాయణరెడ్డి, ఎంపీడీఓ గోవింద్‌రావు, డా.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

గోపాల్‌పేట: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థాయికి వెళ్లాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. బుధవారం మండలంలోని పొలికెపాడు గ్రామంలో రిటైర్డ్ ఎస్ఈ విద్యార్థులకు రూ.80వేల విలువచేసే బూట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్పీ హాజరై మాట్లాడారు. విద్యార్థుల సమయాన్ని వృథా చేసుకోకుండా ఒక లక్ష్యం ఏర్పరచుకొని చదవాలన్నారు. సమాజంపై క్రమశిక్షణ కలిగి ఉండాలని సూచించారు. అనంతరం ప్రతిభా విద్యార్థులకు ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్సై నరేష్‌కుమార్, గ్రామస్తులు, హెచ్ఎం ఈశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

సామ్రాజ్యవాద దూకుడును అరికట్టాలి

వనపర్తి రూరల్: ట్రంప్ సామ్రాజ్యవాద దూకుడును అరికట్టాలని సంయుక్తా కిసాన్ మోర్చ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పాతమార్కెట్ యార్డు ఎదుట దిష్టిబొమ్మలతో దహనం చేస్తుండగా, పోలీసులు అడ్డుకొన్నారు. అనంతరం మెయిన్‌రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మండ్ల రాజు, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి ,కార్యదర్శి పరమేశ్వరాచారి మాట్లాడారు.

కొత్తకోట రూరల్: భారత్ పై అమెరికా విధించిన సుంకాలను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి నిక్సన్ డిమాండ్ చేశారు. బుధవారం కొత్తకోట చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కె.వెంకటయ్య పాల్గొన్నారు.

అమరచింత: అమెరికా విధించిన సుంకాలను రద్దు చేయాలని వామపక్ష రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో చెరుకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ గోపి, ఆర్ఎన్ రమేష్, వెంకటేష్, అజయ్, ఏఐయూకెఎస్ జిల్లా అధ్యక్షుడు రాజన్న, ఉపాధ్యక్షుడు రాజు, ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి భాస్కర్ పాల్గొన్నారు.



వనపర్తిలో ప్రజాసంఘాల నాయకుల నిరసనలు

పాన్‌గల్: సుంకం రద్దు చేయాలని నిరసిస్తూ బుధవారం మండలకేంద్రంలో అంబేడ్కర్ చౌరస్తాలో సంయుక్త్ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేసి జిల్లా సహాయ కార్యదర్శి రాము మాట్లాడారు. కార్యక్రమంలో దేవేందర్, గిరిజనసంఘం నాయకుడు బాల్యనాయక్ పాల్గొన్నారు.

వీపనగండ్ల: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతదేశంపై 50 సుంకం విధించడం సరికాదని సీఐటీయూ మండల కన్వీనర్ బాలగౌడ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణయ్య అన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతయ్య, రామకృష్ణ, రంగస్వామి, కృష్ణయ్య, వెంకటయ్య, శ్రీనివాసులు, మధు, రాజు పాల్గొన్నారు.

డీజేలకు స్వస్తి చెప్పాలి

పాన్‌గల్: గణేష్ ఉత్సవాల్లో డీజే సౌండ్ సిస్టంకు స్వస్తి చెబుతూ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడాలని ఎస్ఐ శ్రీనివాసులు మండపాల నిర్వహకులకు సూచించారు. బుధవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిర్వాహకులు, ప్రజాప్రతినిధులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు.

వనపర్తిటౌన్: నిమజ్జనానికి మినీట్యాంక్ బండ్‌పై ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు మినీ ట్యాంక్‌బండ్‌ని కాంగ్రెస్ సమన్వయకర్త సతీష్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉమా మహేశ్వర్ పరుశురాం పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా కేంద్రంలో కురుస్తున్న భారీ, అతిభారీ వర్షాలకు పాత ఇండ్లు కూలిపోయే అవకాశం ఉందని, పాత ఇండ్లల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వీలైతే సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌లు అన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డి, డీఎంసీ బాలరాజు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: పండుగలను కులమతాలకు అతీతంగా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై జె.నరేష్ అన్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో వివిధ పార్టీలు, తదితర నాయకులతో శాంతి సమావేశం నిర్వహించారు.

ప్రత్యేకశ్రద్ధ వహించండి

ఖిల్లాఘనపురం: కస్తూర్బా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ఉన్నతంగా తీర్చి దిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని జీసీడీఓ సుబ్బలక్ష్మి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బాను ఆమె పరిశీలించి మాట్లాడారు.

భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

కొత్తకోట రూరల్: రాబోయే రెండు, మూడు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఆనంద్ విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని, కొంతమంది తైలిసి తెలవక విద్యుత్ వైర్లు స్తంభాల కింద శిథిలావస్థలో ఉన్న మట్టిమిద్దెలు, పూరి గుడిసెల్లో నివాసం ఉండకుండా ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అనేక చోట్ల రోడ్డు దాటకుండా వర్షపు నీరు వేగంగా ప్రవహిస్తుందని పొలాల్లో రైతులు కూడా వెళ్లకుండా పిడుగుపాటు విషసర్పాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలన్నారు.

ఆత్మకూర్: మండలంలోని కత్తేపల్లి గ్రామంలో డీఏటీ కాల్వ ఎత్తిపారుతుండడంతో పంటలు



కాల్వపైనుంచి ఎత్తిపారుతున్న నీరు

మునుగుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పక్షం రోజులుగా కాల్వ నుంచి నీరు పొలాలను ముంచెత్తుతున్న విషయాన్ని సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చిన పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. రామన్‌పాడు నుంచి నీటి విడుదలను నిలిపివేయాలని, తమ పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

'ఇందిరమ్మ ఇళ్లు కాంగ్రెస్ కార్యకర్తలకేనా'

చిన్నంబావి: ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ కార్యకర్తలకు ఇవ్వడం దేనికి నిదర్శనమని రాష్ట్ర బీజేపీ నాయకుడు కురువ చిన్నమల్లయ్య అన్నారు. ఆయన బుధవారం మండలంలోని అమ్మాయిపల్లి గ్రామంలోని నిరుపేద కుటుంబాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోనే 15 మందిపూరిగుడిసెలో నివసిస్తున్నారని అటువంటి వారికి సంక్షేమ పథకాలు ఇవ్వకపోవడం చాలా బాధాకరమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య, తగరం నరసింహ, జానీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలానికి చెందిన 17 మంది బాధితులకు కాంగ్రెస్ నాయకులు అందజేశారు. బుధవారం పెబ్బేరులోని కాంగ్రెస్ కార్యాలయం జిల్లా పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. మంజూరుకు చేయించిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పెంటన్నయాదవ్, బుచ్చన్న యాదవ్ , మన్యం, కృపాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలి

ఖిల్లాఘనపురం: ప్రతిఒక్కరు దేశభక్తి కలిగి ఉండాలని బీజేపీ నాగర్‌కర్నూల్ పార్లమెంటు అభ్యర్థి భరత్, మాజీ జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దేశంపై భక్తి భావం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్, పెద్ది రాజు తదితరులు పాల్గొన్నారు.



తిరంగా ర్యాలీలో పాల్గొన్న నాయకులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



విద్యనేర్పిన ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

వనపర్తిటౌన్: పట్టణంలో హరిజనవాడ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1987–88 బ్యాచ్ విద్యార్థుల బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ మేరకు విద్యాబుద్ధులు నేర్పిన రిటైర్డ్ హిందీ పండిట్ నీలి నారాయణను వారు సన్మానించారు. అనంతరం పాఠశాలకు బీరువా, 15 కుర్చీలను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడల్లో రాణించాలి

అమరచింత: విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించి తమ లక్ష్యసాధనలో ముందడుగువెళ్లాలని పాలమూరు ఎన్ఆర్ఐ ఫోరం కన్వీనర్ రవీందర్‌రెడ్డి అన్నారు. డీఎంఆర్ఎం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఆయా పాఠశాలలకు చెస్‌బోర్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్‌సింగ్ మాజీ సర్పంచ్ సర్వారెడ్డి, ఎస్ఐ హిమబిందు, కమిషనర్ నాగరాజ్ పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం

వీపనగండ్ల: మండలంలోని బొల్లారం ప్రాథమిక పాఠశాలలో బుధవారం ప్యూరిఫైర్ వాటర్‌ప్లాంట్‌ను ఎంఈఓ నర్సింహులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సుదర్శన్‌రెడ్డి ప్రారంభించారు. కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నిరంజన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీధిదీపాలు బిగింపు

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీలో లైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వార్తలు చూసిన కర్రోళ్ళ భాస్కర్ లైట్లు వేయించేందుకు ముందుకొచ్చారు. బుధవారం ఆయన కాలనీలో పర్యటించి 40లైట్లను ఇప్పించి వేయించారు. ఆయనవెంట మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టుల వితరణ

మదనాపురం: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులు సొంత ఖర్చులతో విద్యార్థులకు టై, బెల్టులు, బ్యాడ్జీలను అందజేశారు. టీచర్లు శివలీల, ప్రసాద్, రూ.40వేలతో సామగ్రిని బుధవారం అమ్మఆదర్శ పాఠశాల చైర్మన్ రేణుక పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మద్దిలేటి ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నియంత్రణ ప్రతిఒక్కరి బాధ్యత

వనపర్తి విద్యావిభాగం: మాదకద్రవ్యాల నిరోధకంపై ప్రతిఒక్కరూ నడుం బిగించాలని డీఐఈవో ఎర్ర అంజయ్య అన్నారు. నషాముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశానుసారం బుధవారం మాదకద్రవ్యాలపై వ్యతిరేకంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేశారు.

ఆత్మకూర్: డ్రగ్స్ మహమ్మారిని తరిమేసేందుకు యువత ముందుకు రావాలని ఎస్సై నరేందర్, కమిషనర్ శశిధర్, డిగ్రీ ప్రిన్సిపాల్ గోపాల్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సైదులు అన్నారు. బుధవారం ఆత్మకూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలో, మున్సిపాలిటీలో మాదకద్రవ్యాల వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు.

చిన్నంబావి: విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించాలని ఎస్ఐ జగన్మోహన్ సూచించారు. బుధవారం పెద్దదగడ గ్రామంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులతో డ్రగ్స్‌పై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: మత్తుపదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ప్రిన్స్‌పాల్ ఓబుల్‌రెడ్డి సూచించారు. బుదవారం పెబ్బేరులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కృష్ణకుమారి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని దొంతికుంట తండా స్టేజి దగ్గర ఉన్న మోడల్ పాఠశాల, కళాశాల దగ్గర మాదక ద్రవ్యాల నిర్మూలనపై పోలీస్‌శాఖ అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై జె.నరేష్, ప్రిన్సిపల్ ఉమాదేవి ఎస్సై జె.నరేష్, ప్రిన్సిపాల్ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.



ఖిల్లాఘణపురం: మోడల్ కళాశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఐఈవో

విద్యార్థుల చేతుల్లోనే దేశభవిష్యత్తు

గోపాల్‌పేట: డ్రగ్స్ నివారించేందుకు కృషి చేయాలని కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ వెంకటేష్ అన్నారు. బుధవారం ఇంటర్‌బోర్డు ఆదేశాల మేరకు కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శేషయ్య పాల్గొన్నారు.

అమరచింత: మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ హిమబిందు కోరారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, డీఎంఆర్ఎం పాఠశాలలో బుధవారం విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో కమిషనర్ నాగరాజు, ఎంఈఓ భాస్కర్‌సింగ్ హెచ్ఎంలు పాల్గొన్నారు.

వనపర్తిటౌన్: డ్రగ్స్‌తో విలువైన జీవితాన్ని పోగొట్టుకోవద్దని పాలమూరు యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కో–ఎడ్ కళాశాలలో యాంటీ డ్రగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఉమా, కోఆర్డినేటర్ యాదగిరిగౌడ్, ధారాసింగ్, అధ్యాపకులు పాల్గొన్నారు. మాదకద్రవ్యాలను నిర్మూలిస్తేనే దేశం ముందుంటుందని డీడబ్ల్యూఓ సుధారాణి అన్నారు. బాలికల బాలుర ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ చేయించారు.

వీపనగండ్ల: మండల కేంద్రంలో కళాశాల ప్రిన్స్‌పాల్ శివగౌడ్, స్టూడెంట్ కౌన్సిలర్ బుధవారం జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాలపై జరిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వనపర్తిలో ..



ఆత్మకూర్ డిగ్రీ కళాశాలలో..



పెబ్బేరు కళాశాలలో..